సాక్షి జగిత్యాల

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



శివ కల్యాణానికి ఆహ్వానం

ధర్మపురి: జైనా శ్రీరామలింగేశ్వర, మార్కండేయ స్వామి ఆలయంలో జరిగే శివకల్యాణానికి రావాలని మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఆలయ కమిటీ చైర్మన్ రాజేశం, ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆహ్వాన పత్రిక అందించారు.



హైలెవల్ వంతెనకు మోక్షం

ఇబ్రహీంపట్నం మండలంలో హైలెవల్ వంతెనలకు మోక్షం లభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/24.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

జరిగిన దాని గురించి ఎప్పుడూ చింతించకు. ఎందుకంటే మనకు జరిగే మంచి మనకు ఆనందాన్ని ఇస్తే జరిగిన చెడు అనుభవాన్ని ఇస్తుంది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:33	శని 4:39

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అఖండ చాలీసా పారాయణం



చాలీసా పారాయణంలో భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం ఆవరణలో 41 రోజుల అఖండ హనుమాన్ చాలీసా పారాయణాన్ని గురువారం ప్రారంభించారు. ఆలయంలోని అభిషేకాల మండపంలో చాలీసా పారాయణం చేశారు. ఎస్పీ భాస్కర్, మల్యాల, కొడిమ్యాల జెడ్పీటీసీలు కొండపల్కల రాంమోహన్‌రావు, పునుగోటి ప్రశాంతి, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు దావ సురేశ్, భక్తులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం



పోలీసులతో అర్చకుల వాగ్వాదం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు గుట్టపై హనుమాన్ చిన్నజయంతి ఉత్సవాల్లో భాగంగా విధుల్లో ఉన్న కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని భక్తులు, అర్చకులు ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో అర్చకులు, పాత్రికేయులు, స్థానిక దుకాణదారులతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. కొండపైకి వచ్చే పాత్రికేయులు, దుకాణదారుల వాహనాలను అడ్డుకోవడం, అర్చకులను విధుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పోలీసులు మంజూరు చేసిన పాస్‌లు చూపించినా అనుమతించకపోవడం ఏంటని ప్రశ్నించారు. అవగాహన ఉన్న సిబ్బందిని ఆలయ విధుల్లో ఉంచాలని స్థానికులు, భక్తులు ఎస్పీ భాస్కర్‌ను ఈ సందర్భంగా కోరుతున్నారు.

ధర్మపురిలో పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి:ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ కనిపించింది. హనుమాన్ చిన్నజయంతి సందర్భంగా శ్రీలక్ష్మినృసింహస్వామి అనుబంధ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న భక్తులంతా ధర్మపురి లక్ష్మినృసింహస్వామి దర్శనానికి రావడంతో ఆలయం కిక్కిరిసింది. హనుమాన్ జయంతి సందర్భంగా ధర్మపురిలో హనుమాన్ భక్తభజన మండలి వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్ అల్పాహారం అందించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ ఉన్నారు.

జగిత్యాల పట్టణ సీఐగా రాంచందర్‌రావు


జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న కిశోర్‌ను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జమ్మికుంట టౌన్ సీఐగా పనిచేస్తున్న రాంచందర్‌రావును జగిత్యాల పట్టణ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పట్టణ సీఐగా పనిచేస్తున్న కిశోర్ రెండు సంవత్సరాలు పూర్తిచేసుకోవడంతో ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

జగిత్యాలజోన్: మెట్‌పల్లి వాస్తవ్యుడైన మాజీ ఎమ్మెల్యే, హైకోర్టు అడ్వకేట్ కొమొరెడ్డి రాములు మృతికి సంతాపంగా జగిత్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సిరిపురం మహేంద్రనాథ్, న్యాయవాదులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



దీక్ష విరమణకు సిద్ధంగా ఉన్న స్వాములు



స్వామివారిని దర్శించుకుంటున్న దీక్షాపరులు

పవనసుత హనుమా..

- అంజన్న స్వాములతో కిక్కిరిసిన కొండ
- ఎటుచూసినా కాషాయమయమే..
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కొండగట్టులో ఘనంగా హనుమాన్ చిన్నజయంతి



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లో నిల్చున్న భక్తులు



కాలినడకన కొండకు వస్తున్న స్వాములు



మజ్జిగ పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్



ఇరుముడితో బాలస్వామి

కొండగట్టు(చొప్పదండి): శ్రీరామ.. జయరామ.. జయ జయ రామా నామస్మరణలతో కొండగట్టు అంజన్న క్షేత్రం పులకించిపోయింది. జైశ్రీరాం.. జైహనుమాన్ అంటూ జయజయ ధ్వనులతో కొండంతా మార్మోగింది. గురువారం హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా కొండగట్టు అంజన్న క్షేత్రం కాషాయమమైంది. దీక్షాపరులతో కిక్కిరిసింది. జయంతి ఉత్సవాల సందర్భంగా మాల విరమణ బుధవారం అర్ధరాత్రి నుంచే ప్రారంభం కాగా.. గురువారం అర్ధరాత్రి వరకు కూడా దీక్షపరులు కొండకు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, ఇరుముడి సమర్పించి, మాల విమరణ చేశారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ భాస్కర్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఈవో వెంకటేశ్ భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెండున్నర లక్షలకుపైగా స్వాముల రాక..

హనుమాన్ చిన్న జయంతి వేడుకలు కొండగట్టులో బ్రహ్మాండంగా జరిగాయి. ప్రధాన అర్చకుడు జితేంద్రప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో అరటిపండ్లతో అంజన్నకు ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువజామున సుప్రభాత సేవా, పంచామృత అభిషేకం, పట్టువస్త్రాలంకరణ, పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. మాల విమరణకు కొండగట్టుకు భారీగా స్వాములు తరలివచ్చారు. బుధవారం రాత్రి వరకే లక్షకుపైగా భక్తులు రాగా.. గురువారం అర్ధరాత్రి వరకు మరో లక్షన్నరకు పైగా భక్తులు మాల విరమణ చేశారని అధికారులు వెల్లడించారు. మెట్లదారిలో కాలినడకన, వాహనాల్లో కొండపైకి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు కూడా దీక్ష విరమణ కార్యక్రమాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. జయంతి సందర్భంగా నాచుపెల్లి, జేఎన్‌టీయూ, ఘాట్ రోడ్, మెట్లదారిలో రద్దీ ఏర్పడింది. కాలినడకన వచ్చే భక్తులు చెట్లకింద సేదతీరారు. ప్రభుత్వ పక్షాన ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. అదనపు కలెక్టర్ మకరంద్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో శాలువతో సత్కరించారు. అర్చకులు ఆశీర్వచనం అందించారు. అనంతరం కోనేరు శానిటేషన్‌ను పరిశీలించారు. భక్తులకు కల్పిస్తున్న వసతుల గురించి ఆరా తీశారు. వై జంక్షన్ వద్ద పంచాయతీరాజ్‌శాఖ, టీఎస్ జీవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్తులకు ఉచిత మజ్జిగ, పండ్లు పంపిణీని ప్రారంభించారు. డీఎస్పీ ప్రకాశ్, సీఐ రమణమూర్తి, ఎస్సై చిరంజీవి బందోబస్తు నిర్వహించారు.

మన పోలీసులు.. మరోసారి హస్తినకు..?

- కరీంనగర్ పోలీసులపై మరోసారి పార్లమెంటుకు ఫిర్యాదు
- స్పీకర్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేసిన బీజేపీ ఎంపీలు
- నాలుగేళ్లలో మూడోసారి పార్లమెంటుకు కంప్లయింట్
- అరెస్టుపై స్పీకర్‌కు సమాచారం ఇచ్చిన సీపీ సుబ్బారాయుడు
- బీజేపీ నిరసనలు, బీఆర్‌ఎస్ ప్రెస్‌మీట్లతో ఉమ్మడిజిల్లాలో పెరిగిన వేడి



5న బండి సంజయ్‌ని అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అరెస్టు వ్యవహారం మరోసారి ఢిల్లీకి చేరింది. పార్లమెంటు సమావేశాలకు హాజరుకావాల్సిన బాధ్యత కలిగిన ఎంపీని అన్యాయంగా, అక్రమంగా ఎలాంటి వారెంట్లు లేకుండా అరెస్టు చేశారంటూ బీజేపీ ఎంపీలు బుధవారం పార్లమెంటు స్పీకర్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఆర్టికల్ 223 ప్రకారం.. బీజేపీ ఎంపీ సోయం బాపూరావు ఈ నోటీసులను ఇచ్చారు. దీంతో కరీంనగర్ పోలీసులు మరోసారి వార్తల్లో నిలిచారు. వాస్తవానికి బండి సంజయ్, పోలీసుల మధ్య జరుగుతున్న ఘర్షణ ఈనాటిది కాదు. నాలుగేళ్లగా సంజయ్– పోలీసుల నడుమ నడుస్తున్న ఈ వివాదంలో పార్లమెంటుకు ఫిర్యాదు చేయడం ఇది మూడోసారి. తాజాగా మరోసారి ఈ వివాదం పార్లమెంటు గడప తొక్కడంతో మరోసారి ఆసక్తికరంగా మారింది. మొత్తం అరెస్టు అనంతరం వరంగల్ పోలీసులకు అప్పగించిన వ్యవహారం మొత్తాన్ని స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు మెయిల్ ద్వారా తెలియజేశారు. వివాదం ఫిర్యాదుకే పరిమితమవుతుందా? మరోసారి కరీంనగర్ పోలీసులు ప్రివిలేజ్ కమిటీ ఎదుట హాజరవుతారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు నగరంలో బీజేపీ చేపట్టిన నిరసనలు, బీఆర్‌ఎస్ ప్రెస్‌మీట్‌తో రాజకీయం వేడెక్కింది.

గతంలో ఏం జరిగింది?

- 2019లో ఆర్టీసీ సమ్మె సందర్భంగా సంజయ్–పోలీసుల మధ్య తొలిసారిగా వివాదం చెలరేగింది. ఆర్టీసీ కార్మికుడు బాబు ఆకస్మికంగా మరణించాడు. దీంతో అతని మృతదేహంతో ధర్నా చేసేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. ఆ సమయంలో ఇన్‌చార్జి సీపీగా డీఐజీ సత్యనారాయణ వ్యవహరించారు. ఆ సమయంలో పోలీసుల తనతో దురుసుగా వ్యవహరించారని బండి తీవ్రంగా మండిపడ్డారు. అనంతరం పార్లమెంటు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పోలీసులు జరిగిన వివాదంపై వివరణ ఇచ్చారు.
- 2022 జనవరి 2న జీవో 317ను రద్దు చేయాలని సంజయ్ తన పార్టీ కార్యాలయంలో తలపెట్టిన 'జాగరణ్ దీక్ష' తీవ్ర ఉద్రిక్తలకు దారి తీసింది. రాత్రిపూట సీపీ సత్యనారాయణ స్వయంగా తలుపులు బద్దలుకొట్టి మరీ ఎంపీ బండి సంజయ్, అతని అనుచరులను అరెస్టు చేయడంతో అప్పట్లో తీవ్ర వివాదంగా మారింది. ఇదికాస్త పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి చేరింది. దీంతో అరెస్టు సమయంలో సీపీ సత్యనారాయణ, ఏసీపీలు ప్రకాశ్, తుల శ్రీనివాస్‌తోపాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్–ఇన్‌స్పెక్టర్లు కూడా ఢిల్లీకి కమిటీ ముందు హాజరవ్వాల్సి వచ్చింది.
- అదే నెలలో బీసీ ఎంపీని అరెస్టు సమయంలో ఇబ్బందిపెట్టారంటూ బీసీ కమిషన్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీంతో అప్పటి సీపీ సత్యనారాయణ, అడిషన్ డీసీపీలు చంద్రమోహన్, శ్రీనివాస్ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు.
- గతేడాది నవంబరు 27వ తేదీన భైంసా సభకు అనుమతి లేదంటూ జగిత్యాల సమీపంలో అరెస్టు చేసిన పోలీసులు అదే రోజు రాత్రి ఆయనను కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లోని నివాసంలో దింపి వెళ్లిపోయారు. ఈ విషయంలోనూ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసేందుకు సంజయ్ సిద్ధమైనా ఆఖరు నిమిషంలో విరమించుకున్నారు.
- ఏప్రిల్ 5న తెల్లవారుజామున 12.15 నిమిషాలకు ఎస్సెస్సీ పేపర్ లీకేజీ కుట్రలో ఎంపీ బండి సంజయ్ పాత్ర ఉందంటూ కరీంనగర్ పోలీసులు ఆకస్మిక అరెస్టుకు దిగారు. ఈ సందర్భంగా సంజయ్‌కు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సంజయ్ ప్రతిఘటించడం, అనుచరులు అడ్డుకోవడంతో బలవంతంగా అరెస్టు చేశారు. దీనిపైనా కేంద్ర ప్రభుత్వ పెద్దలతోపాటు, బీజేపీ అగ్రనేతలు భగ్గుమన్నారు. పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబడుతూ మరోసారి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. సీపీ సుబ్బారాయుడు సైతం బుధవారం జరిగిన అరెస్టు వ్యవహారం మొత్తాన్ని పార్లమెంటు స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు మెయిల్ ద్వారా తెలియజేశారు. ఈ వివాదం మరింత ముదిరితే కరీంనగర్ పోలీసులు మరోసారి హస్తిన ప్రయాణం తప్పదని అభిప్రాయపడుతున్నారు. ఏం జరిగినా తాము చట్టపరిధిలోనే వ్యవహరించామని కరీంనగర్ పోలీసులు ధీమాగా ఉన్నారు.

జైలు వద్ద సందడి

బండి సంజయ్‌ను కరీంనగర్ జైలుకు తరలించిన అనంతరం గురువారం ఉదయం నుంచి జిల్లా కారాగారం వద్ద మీడియా ప్రతినిధుల సందడి నెలకొంది. ఆయనను కలిసేందుకు బండి సంజయ్ భార్య అపర్ణ వచ్చారు. ఆమె వెంట బండి శ్రవణ్ కుమార్, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు ఉన్నారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ కూడా ములాఖత్ ద్వారా బండిని పరామర్శించారు.

డీ-53 కాలువకు నీటి విడుదల చేయండి

- సీఈని కోరిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ఫోన్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): డీ–53 ప్రధాన కాలువకు వెంటనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నీటి పారుదలశాఖ సీఈ సుధాకర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీర్‌పూర్ మండల కొల్వాయి గ్రామానికి చెందిన రైతులు గురువారం ఎమ్మెల్సీని కలిశారు. మరో రెండుతడులు నీరు అందితేనే పంటలు పండుతాయని పేర్కొన్నారు. స్పందించిన జీవన్‌రెడ్డి సీఈతో ఫోన్‌లో మాట్లాడారు. డీ–53కింద బీర్‌పూర్, సారంగాపూర్, రాయికల్, జగిత్యాలతో పాటు ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని గ్రామాల రైతులు వేసిన పంటలకు తప్పనిసరిగా సాగునీరు అందించాలని కోరారు. శ్రీరాంసాగర్ పరిధిలోని బీర్‌పూర్ శివారులోని రోల్లవాగు ప్రాజెక్టు కింది రైతులకు ఫిబ్రవరిలో నీటిని విడుదల చేయడం జరిగిందని, దీనికింద పూర్తిగా పంటలు పండడానికి మరో రెండుతడులు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రస్తుతం డీ–53 రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటిని విడుదల చేయాలని కోరారు. దీనికి సీఈ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ తెలిపా రు. కాగా.. డీ–53కాలువకు శుక్రవారం నుంచి సా గునీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్సారెస్పీ అధికారులు పేర్కొన్నారు. వారబందీ కింద వారంరోజుల పాటు ఇవ్వాల్సిన నీరు కేవలం మూడు రోజులు మాత్రమే విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

- విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు
- కలెక్టర్ యాస్మిన్ బాషా
- 'పది' పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్



ఓల్డ్ హైస్కూల్‌లో భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాల: ప్రశాంత వాతావరణంలో పదోతరగతి పరీక్షలు రాయాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకూడదని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ఇన్విజిలేటర్లు సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని పేర్కొన్నారు.

99.83 శాతం హాజరు

జిల్లాలో జరుగుతున్న పదోతరగతి పరీక్షల్లో మూడో రోజు ఇంగ్లిష్ పేపర్‌కు 68 సెంటర్లలో 11,166 మంది విద్యార్థులకు 11,148 మంది విద్యార్థులు హాజరయ్యారు. 99.83 శాతం హాజరు కాగా అదనపు కలెక్టర్ లత, డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఆకస్మికంగా సెంటర్లను తనిఖీ చేశారు. కోరుట్ల పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులు కాపీ కొడుతుండగా డీఈవో జగన్మోహన్‌రెడ్డి పట్టుకుని డిబార్ చేశారు. సంబంధిత ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

జగిత్యాలక్రైం: పదో తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావేణంలో పరీక్షలు రాయాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్, మండలంలోని చల్‌గల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాలలోని అన్ని జిరాక్స్ షాపులు మూసివేశామన్నారు. అనుమానాస్పదంగా కనిపించిన, పరీక్షా నియమావళికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనఅధికార వ్యక్తులకు పరీక్ష కేంద్రంలోనికి ప్రవేశం లేదని వీటిని పర్యవేక్షించడానికి ప్రతి పరీక్షా కేంద్రంలో పోలీస్ సిబ్బందిని నియమించామని, స్థానిక సీఐ, ఎస్సైలు పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఉద్యోగం నుంచి తొలగించడాన్ని నిలిపివేయాలి

జగిత్యాల: పదో తరగతి పరీక్షల్లో హిందీ పేపర్ లీకేజీకి బాధ్యత చేస్తూ సబియా మదాహత్ అనే ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించడం సరికాదని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు అన్నారు. హన్మకొండ జిల్లాలోని కమలాపూర్ మండలకేంద్రంలోని పదోతరగతి పరీక్ష కేంద్రం నుంచి హిందీ పేపర్ లీక్ కావడంలో ఇన్విజిలేటర్ ప్రమేయం లేదని, అది ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారం కిటికి సమీపంలో కూర్చున్న విద్యార్థి ఇన్విజిలేటర్ తనపనిలో నిమగ్నమైన సమయంలో అదను చూసి బయటి వ్యక్తికి సహకరించడం వల్ల జరిగిందన్నారు. బయటి నుంచి ఓ వ్యక్తి చెట్టెక్కి గోడ దూకి మొదటి అంతస్తులో ఉన్న తరగతి గది కిటికి వద్దకు చేరుకుని రహస్యంగా ఫొటోతీసి వాట్సప్ ద్వారా ఇతరులకు చేరవేయడం పూర్తిగా భద్రత వైఫల్యం తప్ప మరొకటి కాదన్నారు. ఒకవేళ ఇన్విజిలేటర్ ఏమరపాటుగా ఉన్నారని భావించినా అట్టి పొరపాటుకు ఉద్యోగం నుంచి తొలగించడం లాంటి పెద్ద శిక్ష విధించడం సరి కాదని, ఉపాధ్యాయురాలిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాయకులు గురువారం కలెక్టర్ యాస్మిన్‌బాషాకు వినతిపత్రం అందించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విన్నవించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యదర్శి నరేందర్‌రావు, ఒడ్నాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే అరెస్టు’

చందుర్తి(వేములవాడ): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఆరోపించారు. బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా చందుర్తి మండల కేంద్రంలో పార్టీ జెండాను గురువారం ఆమె ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ చేతకాని విధానాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందన్నారు. నియంత పాలనకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పేపర్ లీకేజీలతో రాష్ట్ర సర్కారు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. చందుర్తి మండలంలోని మల్యాల, నర్సింగపూర్ గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

హైలెవల్ వంతెనలకు మోక్షం

- ఇబ్రహీంపట్నం మండలంలో ఐదుచోట్ల నిర్మాణానికి చర్యలు
- రూ.10 కోట్లు మంజూరు
- టెండర్లు పూర్తి.. పనులకు 9 నెలల సమయం



యామాపూర్-ఫకీర్ కొండాపూర్ దారిలో లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలో 5 లోలెవల్ వంతెనలున్నాయి. ఏటా వానాకాలంలో వాటి పైనుంచి భారీగా నీళ్లు ప్రవహిస్తుండటంతో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్ దారిలో తిమ్మాపూర్ వద్ద ఒకటి, యామాపూర్ నుండి ఫకీర్ కొండాపూర్ వెళ్లే దారిలో ఒకటి, ఇబ్రహీంపట్నం నుంచి బట్టాపూర్‌కు వెళ్లే రోడ్డులో రెండు, కొమటి కొండాపూర్ నుంచి ఎర్దండికి వెళ్లే దారిలో ఒక లోలెవల్ వంతెనలు ఉన్నాయి. మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్, గోదూర్ నుంచి బట్టాపూర్ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చారు. వర్షకొండ గ్రామానికి వెళ్లే రోడ్డులో చుట్టూ లోలెవల్ వంతెనలు ఉండటం వల్ల వానాకాలంలో రాకపోకలు నిలిచిపోయి, గ్రామస్తులు ఎటూ వెళ్లలేని పరిస్థితి. బట్టాపూర్ నుంచి గోదూర్, యామాపూర్ నుంచి ఫకీర్ కొండాపూర్ ద్వారా నిర్మల్ జిల్లా వైపు రోజూ అనేక వాహనాలు వెళ్తుంటాయి. వర్షాకాలం వంతెనల పైనుంచి నీరు భారీగా వెళ్లడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎమ్మెల్యే విద్యసాగర్‌రావుకు పలుమార్లు విన్నవించారు.

ఎమ్మెల్యే చొరవతో నిధులు..

ఇబ్రహీంపట్నం మండలంలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు రూ.10 కోట్లు మంజూరు చేయించారు. యామాపూర్ నుంచి ఫకీర్ కొండాపూర్ వెళ్లే దారిలో హైలెవల్ వంతెనకు రూ.4 కోట్లు, ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండ మధ్య రెండు రోడ్యామ్‌లకు రూ.3.30 కోట్లు, కొమటికొండాపూర్ నుంచి ఎర్దండి దారిలో హైలెవల్ వంతెనకు రూ.2 కోట్లు, తిమ్మాపూర్ నుంచి యామాపూర్ మధ్యలో నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఇటీవల టెండర్లు కూడా పిలిచారు. కాంట్రాక్టర్లు, తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉంది. పనులు పూర్తయితే తమ ఇబ్బందులు తొలగిపోతాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు జిల్లాలకు ప్రయోజనం



ఫకీర్ కొండాపూర్ శివారులో హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. పనులు పూర్తయితే జగిత్యాల, నిర్మల్ జిల్లాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– గుంటి లక్ష్మి, సర్పంచ్, ఫకీర్ కొండాపూర్

ఏళ్లనాటి సమస్య తీరనుంది..



వర్షకొండ శివారులో పెద్ద లోలెవల్ వంతెన ఉండటం వల్ల ఏటా వర్షాకాలంలో భారీగా వరద నీరు ప్రవహించేది. దీంతో గ్రామ ప్రజలు రోజుల తరబడి ఎటూ వెళ్లలేక ఇబ్బందులు పడేవారు. హైలెవల్ వంతెన నిర్మిస్తే ఏళ్లనాటి సమస్య తీరనుంది.

– పొనకంటి వెంకట్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు

త్వరలో పనులు ప్రారంభం



ఇబ్రహీంపట్నం మండలంలోని లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. కాంట్రాక్టర్లు త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

– వేణు, ఏఈఈ ఆర్‌అండ్‌బీ, మెట్‌పల్లి

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఘటన



కిశోర్ మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి చెందిన ఘటన కోనరావుపేట మండలం మరిమడ్లలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. మరిమడ్లకు చెందిన లోకుర్తి మల్లేశం తన వ్యవసాయ క్షేత్రాన్ని దున్నేందుకు జైసేవాలాల్ భుక్యారెడ్డితండాకు చెందిన భుక్యా కిశోర్(27)ను తీసుకెళ్లాడు. గురువారం తెల్లవారుజామున 2 గంటలకు కిశోర్ బైక్‌పై ముందు వెళ్తూ వెనుక ట్రాక్టర్‌కు దారి చూపిస్తున్నాడు. మరిమడ్ల అటవీ ప్రాంతంలోని ఎలకచెట్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల వేట కోసం ఇనుప వైర్ అమర్చి కరెంట్ షాక్ పెట్టారు. ఆ తీగలను గమనించకపోవడంతో కిశోర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య విజయ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుని భార్య విజయ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలోని పలు అటవీ గ్రామాల్లో గత కొన్ని రోజులుగా వన్యప్రాణుల వధ యథేచ్ఛగా సాగుతోంది. అటవీ జంతువుల కోసం వలలు, విద్యుత్ తీగలు పెడుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎస్సై మృతితో విషాదం

- సిరిసిల్లలో హెడ్‌కానిస్టేబుల్‌గా, ఏఎస్సైగా సేవలు
- గోదావరిఖనిలో తిలక్‌నగర్ శ్రీనుగా సుపరిచితుడు
- మూగబోయిన జమ్మికుంట మండలం మోత్కులగూడెం



తిలక్‌నగర్‌లో శ్రీనివాస్ దంపతుల మృతదేహాలు

గోదావరిఖని/జమ్మికుంట/సిరిసిల్ల: జనగామ ఎస్సైగా పనిచేస్తున్న కాసర్ల శ్రీనివాస్ ఆత్మహత్య ఉమ్మడి జిల్లాను కదలించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఆయన తిలక్‌నగర్ శ్రీనుగా అందరికీ సుపరిచితుడు. ఆయన మరణవార్తతో చిన్ననాటి స్నేహితులంతా షాక్‌కు గురయ్యారు. కుటుంబ తగాదాలతో ఆయన భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా .. ఆమె మృతిని తట్టుకోలేక సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని శ్రీనివాస్ బలవన్మరణానికి పాల్పడిన విషయం తెల్సిందే. మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాస్ బాల్యమంతా గోదావరిఖనిలోనే సాగింది. స్థానిక జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివాడు. కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఎక్కువ కాలం పనిచేశారు. ఎస్సైగా పదోన్నతిపై జనగామకు వెళ్లారు. స్వరూప, శ్రీనివాస్ దంపతులకు ఇద్దరు కుమారులు రవితేజ, భార్గవ్‌తేజ సంతానం. ఆయన మరణవార్త విని ఆప్తమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. దంపతుల మృతదేహాలను ఇక్కడకే తీసుకురానున్నట్లు బంధువుల ద్వారా తెల్సింది.

మూగబోయిన మోత్కులగూడెం

ఎస్సై శ్రీనివాస్ భార్య స్వరూపది జమ్మికుంట మున్సిపాలిటీ పరిధి మోత్కులగూడెం. గ్రామానికి చెందిన శీలం కృష్ణస్వామి, లక్ష్మి పెద్ద కూతురు. శ్రీనివాస్ ఉద్యోగ విరమణ అనంతరం మోత్కులగూడెంలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకునేలా ఇంటి స్థలం, వ్యవసాయ భూమి కూడా కొనుగోలు చేసినట్లు తెలిసింది. అంతలోనే ఈ సంఘటన చోటుచేసుకోవడంతో గ్రామం మూగబోయింది. మృతుల కుటుంబానికి జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వద్లూరి సానుభూతి తెలిపారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

సిరిసిల్లతోనూ అనుబంధం

ఆత్మహత్య చేసుకున్న ఎస్సై కాసర్ల శ్రీనివాస్‌కు రాజన్న సిరిసిల్లతోనూ అనుబంధం ఉంది. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా 2002 నుంచి పనిచేశారు. ఏఎస్సైగా పదోన్నతి లభించాక 2011వరకూ ఇక్కడే విధులు నిర్వర్తించారు. వేములవాడలోనూ ఏఎస్సైగా పనిచేశారు. నక్సలైట్ల కదలికలు ఉన్న రోజుల్లోనూ చురుగ్గా పనిచేసి అధికారుల మన్ననలు పొందారు. సుమారు దశాబ్దకాలం జిల్లాలో పనిచేసిన శ్రీనివాస్ ఎస్సైగా పదోన్నతి పొంది జనగామకు వెళ్లారు. ఇటీవల తన కుమారుడి వివాహానికి సైతం జిల్లా నుంచి పలువురు వెళ్లారు.

ఉరేసుకొని వలసజీవి బలవన్మరణం

- మృతుడు పోతారంవాసి
- నాలుగు నెలల క్రితమే గల్ఫ్ నుంచి రాక
- మరో నెల రోజుల్లో వెళ్లాల్సి ఉండగా ఆత్మహత్య



నరేశ్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన అన్నారపు నరేశ్(38) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నరేశ్ ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా బహ్రెయిన్ వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితమే స్వగ్రామం వచ్చాడు. మరో నెల రోజుల్లో సౌదీ అరేబియా వెళ్లాలని నిర్ణయించుకొని, ఏర్పాట్లు చేసుకున్నాడు. గురువారం ఉదయం తన ఇంట్లోనే ఉరేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం విచారణ చేపడితే ఆత్మహత్యకు గల కారణాలు తెలిసే అవకాశం ఉందని ఎస్సై శ్వేత పేర్కొన్నారు. మృతుడికి భార్య రజిత, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి తల్లి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయి నుంచి తండ్రి వచ్చాక అంత్యక్రియలు

నరేశ్ తండ్రి భూమయ్య దుబాయిలో ఉంటున్నాడు. కొడుకు ఆత్మహత్య విషయం తెలియగానే చివరిసారి చూసుకునేందుకు వస్తానని ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం అందించాడు. దీంతో నరేశ్ మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచి, శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మృతుడి బంధువులు పేర్కొన్నారు.

స్టడీ సర్కిల్ నిరుద్యోగులకు వరం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభ్యర్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ నిరుద్యోగులకు వరమని, జగిత్యాల ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఫౌండేషన్ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో జిల్లాలో ఎస్సీ స్టడీ సర్కిల్, మంత్రి గంగుల సహకారంతో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.కోటితో లైబ్రరీతోపాటు నియోజకవర్గంలో 5 జూనియర్, ఒక డిగ్రీ, నర్సింగ్, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పేపర్ల లీకేజీ బాధాకరమని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. నిరుద్యోగ యువతను ఆగం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, కౌన్సిలర్ నర్సమ్మ, స్టడీ సర్కిల్ డైరెక్టర్లు శ్రీకాంత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ యాస్మిన్ బాషా, అధికారులు

జగిత్యాల: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125అడుగుల భారీ విగ్రహ ఆవిష్కరణ ఏప్రిల్ 14న వైభవోపేతంగా జరుగుతుందని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆరుబస్సుల ద్వారా 300 మందిని తరలించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని, దీనిని విజయవంతం చేసేందుకు ప్రతి కృషి చేయాలన్నారు. మధ్యాహ్నం 1గంటకు ప్రజలు హైదరాబాద్‌కు చేరుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. వచ్చేవారికి దారిలోనే టిఫిన్, లంచ్, డిన్నర్ ఏర్పాట్లు చేయాలని, ప్రతి బస్సులో పోలీస్ అధికారి, ప్రభుత్వ అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించాలన్నారు. రెండవ విడత కింద ఎంపిక చేసిన 3.38 లక్షల లబ్ధిదారులలో మరణించిన వారి నామిని వివరాలు సేకరించి వారికి గొర్రెల యునిట్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ శ్రీమతి షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, అంబేద్కర్ జయంతికి తరలించేలా ఏర్పాటు చేస్తామన్నారు. గొర్రెల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేసేలా చూస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్లు మకరంద్, లత పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిలను కలిసిన బార్ అసోసియేషన్



జడ్జి అనుపమ చక్రవర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న లాయర్లు

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్‌కు నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులు గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసి, పలు విజ్ఞప్తులు చేశారు. హైకోర్టు న్యాయమూర్తులైన జగిత్యాల జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ అనుపమ చక్రవర్తితో పాటు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ సంతోశ్‌రెడ్డి, జస్టిస్ పుల్ల కార్తీక్‌లను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కలిశారు. జిల్లాలో జిల్లా ప్రధాన న్యాయస్థానం ఏర్పాటైనందున, ఇప్పటి వరకు కరీంనగర్ జిల్లా కోర్టు పరిధిలో ఉన్న జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ కోర్టు కేసులు, మైనర్ బాలురకు సంబంధించిన జువైనల్ కోర్టు కేసులు, భార్యభర్తలకు సంబంధించిన ఫ్యామిలీ కోర్టు కేసులు, ఎక్సైజ్ కోర్టుకు సంబంధించిన ఎక్సైజ్ కేసులను జగిత్యాల జిల్లాకు బదిలీ చేయాలని వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్, హైకోర్టు న్యాయవాది వేణుమాధవ్, జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కట్కం చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులు మారిశెట్టి ప్రతాప్, ఓంప్రకాశ్, జంగిలి మల్లికార్జున్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ, అరాచక పాలన

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో నియంతృత్వ, అరాచక పాలన కొనసాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు ఆరోపించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా గురువారం జగిత్యాల తహసీల్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్ధరాత్రి పోలీసులు ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు అని కూడా చూడకుండా సంజయ్‌ని అక్రమంగా అరెస్టు చేయడం సీఎం కేసీఆర్ ప్రభుత్వ నియంతృత్వ పాలనకు నిదర్శనమన్నారు. ఈ సర్కారుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నాయకులు బీజేపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. తమ అధ్యక్షుడిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగ శ్రావణి, మదన్‌మోహన్, తిరుపతి, అనిల్‌కుమార్, జగదీశ్, గంగాధర్, రమణ, అశోక్, ఆముద రాజు, రాజన్న, దివాకర్, పవన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నియంత పాలనకు స్వస్తి పలకడమే లక్ష్యం

- లిక్కర్ కేసును పక్కదారి పట్టించేందుకే ఎంపీ బండి సంజయ్ అరెస్టు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబారి ప్రభాకర్



ధర్నా చేస్తున్న ప్రభాకర్, నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): సీఎం కేసీఆర్ నియంత పాలనకు స్వస్తి పలికి, రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ఆవిర్భావ వేడుకలకు ఆయన హాజరయ్యారు. అనంతరం అంబేడ్కర్ కూడలి వద్ద నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఫాంహౌస్‌కు పరిమితం చేసే సమయం ఆసన్నమైందన్నారు. కుటుంబ పాలనలో బందీ అయిన రాష్ట్రాన్ని విముక్తి చేయడానికే తమ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ నేతృత్వంలో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నికల వాగ్దానాలను విస్మరించి, అన్ని వర్గాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ, ఎస్సెస్సీ పేపర్ల లీకులతో ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను నాశనం చేస్తోందని మండిపడ్డారు. ఢిల్లీ లిక్కర్ కేసును పక్కదారి పట్టించేందుకే సంజయ్‌ని అరెస్టు చేశారన్నారు. ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు గడ్డం నవీన్‌రెడ్డి, నాయకులు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైల మల్లేశ్‌యాదవ్, వేణు, పుప్పాల మహేశ్, శివరాత్రి అంజమ్మ, నంగి సాయన్న, మండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

చిల్వాకోడూర్‌లో హనుమాన్ దీక్షాపరుల ధర్నా

- ఓ వర్గం వారు శోభాయాత్రను అడ్డుకొని, దాడికి యత్నించారంటూ నిరసన
- డీఎస్పీ జోక్యంతో ఆందోళన విరమణ
- ఇరువర్గాలపై కేసు



ఇరువర్గాలతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాశ్

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని చిల్వాకోడూర్‌లో జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపై 50 మందికి పైగా హనుమాన్ దీక్షాపరులు, వారికి మద్దతుగా విశ్వహిందూ పరిషత్ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఓ వర్గం వారు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం చిల్వాకోడూర్ గ్రామంలోని మసీదు సమీపం నుంచి హనుమాన్ దీక్షాపరులు డీజే పాటలతో శోభాయాత్ర చేపట్టారు. ఓ వర్గానికి చెందిన కొందరు ఆకతాయిలు హనుమాన్ ఉత్సవ మూర్తిపై కర్రలు విసిరి, తమపై దాడికి యత్నించారని స్వాములు ఆరోపించారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని, బాధ్యులు వచ్చి, తమకు క్షమాపణ చెప్పాలన్నారు. సుమారు 2 గంటలపాటు రోడ్డుపై నిరసన తెలపడంతో రెండువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ధర్మపురి సీఐ కోటేశ్వర్, ఎస్సై దత్తాద్రి వచ్చి, నచ్చజెప్పినా వినిపించుకోలేదు. ఇరువర్గాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు వివాద పరిష్కారానికి శాంతియుత మార్గం చూపినా స్వాములు ఒప్పుకోలేదు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డీఎస్పీ ప్రకాశ్ పోలీసు బలగాలతో వచ్చి, ఇరువర్గాలతో మాట్లాడారు. వివాదానికి కారుకులపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో దీక్షాపరులు ధర్నా విరమించారు. చివరికి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.